క్లుప్తంగా

సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు


దెందులూరు 9వ వార్డులో సంక్రాంతి ఏర్పాట్లు ప్రారంభించిన శ్రీరామదండు కమిటీ

దెందులూరు: దెందులూరు శ్రీరామదండు కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా సంక్రాంతి సంబరాలు ఏటా నిర్వహిస్తున్నారు. సంబరాలు నిర్వహించేందుకు ఆదివారం దెందులూరు 9వ వార్డు సెంటరులో ఏర్పాట్లను సుగ్గిశెట్టి నూకరాజు ప్రారంభించారు. ఇతర దేశాల్లో ఉన్న తెలుగువారిని గ్రామానికి ప్రత్యేక ఆహ్వానం పలికేందుకు, తెలుగుదనం ఉట్టిపడేలా అందరి సహాయ సహకారాలతో సంక్రాంతి పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రామదండు కమిటీ తెలిపింది.

మందులపై జీఎస్టీని తగ్గించాలి


మాట్లాడుతున్న యూవీ కృష్ణయ్య

ఏలూరు (టూటౌన్): మందులపై జీఎస్టీని తగ్గించాలని, మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్లకు కార్మిక చట్టాలు అమలు చేసి, కనీస వేతనం ఇవ్వాలని ఏపీ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ యూవీ కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్థానిక పవర్పేటలోని సీఐటీయూ కార్యాలయంలో బి.సత్యనారాయణ అధ్యక్షతన యూనియన్ వార్షిక మహాసభ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీఎస్టీ పేరుతో అన్ని రకాల వస్తువులపై విపరీతంగా పన్నులను పెంచిందని విమర్శించారు. ప్రజల ఆరోగ్యం కోసం ప్రాణావసరమైన మందులపై కూడా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని విధించటం దారుణమని అన్నారు. జీఎస్టీ నుంచి ప్రజల అత్యవసర, నిత్యావసర మందులను మినహాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఫార్మా సంస్థలు, వ్యాక్సిన్ కంపెనీలను పునరుద్ధరించాలని కోరారు. ఫార్మా రంగంలో పనిచేస్తున్న సేల్స్ రిప్రజెంటేటివ్లకు కార్మిక చట్టాలు వర్తింపజేయాలని అన్నారు. కనీస వేతనాలు అమలు చేసేలా ఫార్మా కంపెనీలకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు పి.కిషోర్ మాట్లాడారు. యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బీవీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా మొహిద్దీన్, కోశాధికారిగా వై.దుర్గారావు, ఉపాధ్యక్షులుగా పి.కిరణ్ కుమార్, పి.శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీగా సీతయ్య, ఉమా మహేష్, కమిటీ సభ్యులుగా చెన్న కేశవ, సీహెచ్ కార్తీక్, కె.శివలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్లు పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్ల పంపిణీకి ఎంపిక

ఏలూరు (ఆర్ఆర్పేట): హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కృత్రిమ కాళ్ల పంపిణీ నిమిత్తం ఎంపిక శిబిరం నిర్వహించారు. పుట్టుకతో అంగవైకల్యం, ప్రమాదాల వలన కాళ్లు పోవడం, మధుమేహ వ్యాధి తీవ్రతతో కాళ్లు తొలగించిన వారికి నడవడానికి తోడ్పడే ఆర్టిఫిషియల్ లెగ్స్ (కృత్రిమ కాళ్లు) ఉచితంగా పంపిణీ చేయడానికి క్లబ్ అధ్యక్షుడు కేబీ రావు, సెక్రటరీ బొల్లా వీవీ సత్యనారాయణ, కోశాధికారి డి.రమాదేవి నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రముఖ వైద్యులు రావి గోపాలకృష్ణయ్య, ప్రవాసాంధ్రులు డాక్టర్ కె.శ్రీనివాస్ ప్రసాద్, డాక్టర్ హిమబిందు (యూఎస్ఏ) ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. లయన్స్ పూర్వపు గవర్నర్ డాక్టర్ యార్లగడ్డ జగన్మోహనరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి అతిథులుగా లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, వైస్ గవర్నర్లు కాకరాల వేణుబాబు, పాపారావు నాయుడు, పూర్వపు గవర్నర్ మేకా శ్రీరామ్ సురేష్, కేవీ కిషోర్ కుమార్, రీజియన్ చైర్మన్ వి.మల్లికార్జునరావు, జోన్ చైర్మన్ కుర్మా శ్రీనివాస్, క్లబ్ మార్కెటింగ్ చైర్మన్ దువ్వి హేమసుందర్ పాల్గొన్నారు. శిబిరంలో సుమారు 150 మంది వికలాంగులకు స్క్రీనింగ్ నిర్వహించి 90 మందిని ఎంపిక చేశారు. వారందరికీ కొద్ది రోజుల్లోనే కృత్రిమ అవయవాలు అందిస్తామని క్లబ్ అధ్యక్షుడు తెలిపారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ఏలూరు రూరల్: పోణంగి మండల పరిషత్ పాఠశాలలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇటీవల బదిలీ అయిన జీజేపీ స్టీవెన్, కె.దేవీప్రసాద్లను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. డీఈఓ పి.శ్యామ్సుందర్, జిల్లా డీఆర్డీఓ పీడీ ఆర్.విజయరాజు, పెదపాడు, ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి, ప్రకాష్రాజు, ఎంఈఓ 2 రంగయ్యతో పాటు ఉపాధ్యాయులు తేరా ప్రభాకర్, మాసగిరి శ్రీనివాస్, పోణంగి పాఠశాల హెచ్ఎం కందుల రాంబాబు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తాఫా ఆలీ పాల్గొన్నారు.

దెందులూరును నంబర్ వన్ చేస్తా

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- ఏలూరు రూరల్ గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద పాదయాత్ర
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం


జాలిపూడిలో సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: దెందులూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్గా తీర్చిదిద్దడమే తన ధ్యేయం అని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. ఆదివారం ఆయన ఏలూరు రూరల్ మండలం జాలిపూడి, కాట్లంపూడిలో ప్రజా ఆశీర్వాద పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల టీడీపీ పాలనలో పచ్చ నాయకులు దెందులూరు నియోజకవర్గాన్ని అక్రమాలు, బెదిరింపులకు చిరునామా చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గం అభివృద్ధి, ప్రశాంత వాతావరణానికి మారుపేరుగా నిలిచిందన్నారు. టీడీపీ పాలనలో గ్రామానికి రూ.20 నుంచి రూ.30 లక్షలు ఖర్చు చేయడమే గగనమైతే, వైఎస్సార్ సీపీ పాలనలో ఒక్కొక్క గ్రామానికి రూ.30 నుంచి రూ.50 కోట్ల రూపాయలు వెచ్చించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి సహకారంతో నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపానన్నారు. వందల కోట్ల రూపాయల నిధులతో ప్రధాన రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి పైప్లైన్, ఓవర్హెడ్ ట్యాంకు, కల్వర్టులు తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేశామని వివరించారు. దెందులూరు, పెదపాడు, పెదవేగి, కొల్లేరు ప్రజల కోసం విద్యుత్ లైన్లు ఆధునీకీకరణ, సబ్స్టేషన్లు నిర్మించామన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేసేందుకు సచివాలయం, వైఎస్ఆర్ క్లినిక్, ఆర్బీకే కేంద్రాలు నిర్మించామన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఇంటర్వ్యూలు చేపట్టి, అనేక రంగాల్లో ఉద్యోగాలు కల్పించామన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలన్న సీఎం జగన్మోహన్రెడ్డి సంకల్పంతో నియోజకవర్గంలో నీటి పారుదల వ్యవస్థ మెరుగుపరిచామని గుర్తు చేశారు.

అందరికీ సంక్షేమ పథకాలు

టీడీపీ పాలనలో పేదవాడికి పింఛన్ మంజూరు చేయాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల కాళ్ళు మొక్కాల్సిన దుస్థితి ఉండేదన్నారు. సీఎం జగన్మోహన్రెడ్డి పాలనలో కుల, మత, వర్గ భేదం లేకుండా అర్హత కలిగిన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలో 1.50 లక్షల మంది ప్రజలకు సంక్షేమ పథకాల అందుతున్నాయన్నారు. ఇందుకోసం ప్రభుత్వం వందల కోట్లు విడుదల చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీని గెలిపించి మరోసారి వైఎస్ జగన్ మోహన్రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాలిపూడిలో సచివాలయం, సీసీ రోడ్లు తదితర పనులు ప్రారంభించారు. కాట్లంపూడిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. స్థానిక మహిళల కోరిక మేరకు డ్రెయినేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈనెల 3న పైడిచింతపాడులో ప్రారంభమైన ఎమ్మెల్యే పాదయాత్ర కాట్లంపూడితో ముగిసింది. ఎమ్మెల్యే వెంట వడ్డీకుల కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, ఎంపీడీఓ బి.ప్రణవి, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన్నప్రసాద్, వడ్డీకుల కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు, పార్టీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, ఎంపీటీసీ కాకర్ల తంబి, సర్పంచ్లు వీధి నవ్య, నిట్టా అక్కమ్మ, బలే నాగప్రసాద్, మధ్యాహ్నపు వాసు, కోడిచుక్కల నాగేషు, పరశురాం, వర్రీ నారాయణ, పంపుల శ్రీను తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే కొఠారును కలిసిన దెందులూరు మండల వైఎస్సార్ సీపీ నాయకులు

పాదయాత్రలో ఎమ్మెల్యేను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు

దెందులూరు: ప్రజా ఆశీర్వాద యాత్ర చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని ఆదివారం దెందులూరు మండల వైఎస్సార్ సీపీ నేతలు కలిసి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. వైఎస్సార్ సీపీకి కంచుకోటగా ఉన్న ఏలూరు రూరల్ మండలంలో ప్రజా ఆశీర్వాద పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజలు బ్రహ్మరథం పట్టడం తమకెంతో సంతోషంగా ఉందని సానిగూడెం సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు), వైఎస్సార్ సీపీ నాయకులు తొత్తడి కృష్ణ, బత్రాజు సత్యనారాయణ, ఐనంపూడి రాము అన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం


తెలుగు పండిట్ జీ జ్యోతిని సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: అంకితభావం, ప్రణాళిక, సత్ఫలితాల సాధనదిశగా పని చేసేవారు ఎవరికైనా అవార్డులు ప్రోత్సాహాన్నిస్తాయని పండిట్ పరిషత్ రాష్ట్ర నాయకులు గిరిరాజు, పారిశ్రామికవేత్త నారా శేషు, దెందులూరు బాలికల పాఠశాల హెచ్ఎం పీ.శ్రీదేవి అన్నారు. ఆదివారం దెందులూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల సావిత్రిబాయిపూలే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన జీ జ్యోతిని గిరిరాజు, నారా శేషు సత్కరించారు.

చెకుముకి పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమస్థానం

పెదపాడు: అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు పోటీల్లో విద్యార్థులు వీ రవికిరణ్, ఎం రాఘవేంద్ర, పీ రూపిణి ప్రథమ స్థానం సాధించారు. శిక్షణ అందించిన సైన్స్ ఉపాధ్యాయులు ఎం అమరావతి, ఏ విజయసారథిని ప్రధానోపాధ్యాయురాలు తోట పుష్పావతి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చింతా రమాదేవి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు తదితరులను విద్యార్థులను అభినందించారు.

ముమ్మరంగా దాళ్వా వరి నాట్లు


నాచుగుంట ఆయకట్టులో నాట్లు వేస్తున్న దృశ్యం


సిద్ధమైన నారుమళ్లు

ఉంగుటూరు: దాళ్వా వరినాట్ల పనులు రైతులు ముమ్మరంగా చేపట్టారు. బెంగాలీ కూలీలు రావడంతో 15 రోజుల నుంచి నాట్లు వేసే పనులు జోరందుకున్నాయి. బెంగాలీ కూలీలు పొలాల వద్దనే వంటలు చేసుకుని నాట్లు పనులు చేస్తున్నారు. వెల్లమిల్లి, నాచుగుంట, నీలాద్రిపురం, గోపినాథపట్నం, ఉంగుటూరు, కాగుపాడు, బొమ్మిడి, కాకర్లమూడి, ఉప్పాకపాడు, దొంతవరం ఆయకట్టు ప్రాంతాల్లో ఇప్పటికే నాట్లు పూర్తయ్యాయి. కైకరం, ఎ.గోకవరం, చేబ్రోలు, నారాయణపురం, గొల్లగూడెం, నల్లమాడు ప్రాంతాల్లో నాట్లు వేస్తున్నారు. రైతులు, రైతు కూలీలు నాట్లు వేసే పనుల్లో నిమగ్నమై పని చేస్తున్నారు. మండలం మొత్తం మీద 12 వేల హెక్టార్లలో నాట్లు పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా ఎంటీయూ 1121 రకం ఎక్కువ విస్తీర్ణంలో నాట్లు వేస్తున్నారు. పీఆర్ 126, ఎస్ఎల్ 10 రకం ప్రైవేటు రకాలను కొందరు రైతులు నాట్లు వేస్తున్నారు. ఈ మూడు రకాలు 120 రోజుల పంటకాల పరిమితిగా ఉంది. వ్యవసాయ శాఖ అధికార్లు రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.

అన్ని వర్గాల ప్రజలకూ ఆసరాగా పథకాలు


దెందులూరు: శ్రీరామవరంలో కనుమూరి నాగేంద్రబాబుకు రూ.10 వేలు పెన్షన్ అందజేస్తున్న కామిరెడ్డి నాని, కనుమూరి సావిత్రి


ఉంగుటూరు: నారాయణపురంలో పింఛన్ అందజేస్తున్న మరడ మంగరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ రమావతి

దెందులూరు: అన్ని వర్గాల పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలతో పాటు కిడ్నీ బాధితులను పథకాల రూపంలో సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆసరాగా ఉంటూ వారిని ఆదుకుంటున్నారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం శ్రీరామవరంలో కిడ్నీ బాధితుడు కనుమూరి నాగేంద్రబాబుకు ఉపసర్పంచ్ కనుమూరి సావిత్రి, వలంటీర్ కొత్తపల్లి జ్యోతితో కలిసి కామిరెడ్డి నాని రూ.10 వేల పింఛన్ నగదును అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు అక్కినేని శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తపల్లి రాఘవులు, గోపిరాజు, వార్డు మెంబర్లు నాయకులు కామిరెడ్డి బాలు, ప్రతాప్, సాయి, మామిడి రాంబాబు, రాము, ఉన్నారు.

పింఛన్ లబ్ధిదారుల హర్షం

ఉంగుటూరు: పెన్షన్ రూ.3 వేలు పెంపుతో సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చినట్లుందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. ఆదివారం నారాయణపురంలో పెంచిన రూ.3 వేలు పింఛన్ నగదును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, పార్టీ అధ్యక్షుడు పైడి అరుణకుమార్, ఎంపీటీసీ సభ్యుడు ఆరవెల్లి మహాలక్ష్మి దానయ్య, సచివాలయ కన్వీనర్ సిపాని బాలు, 5 వార్డు మెంబరు పైడి వెంకటలక్ష్మి, పైడ వరప్రసాదు పాల్గొన్నారు.

ఇన్పుట్ సబ్సిడీని సద్వినియోగం చేసుకోండి

దెందులూరు: పత్తి రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని, ప్రోత్సాహాన్ని పట్టు పురుగుల పెంపకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల టెక్నికల్ అసిస్టెంట్ పీ రత్తయ్య అన్నారు. ఆదివారం మండలంలోని రామారావుగూడెంలో నిర్మిస్తున్న పట్టు పురుగుల తయారీ షెడ్డును ఆయన పరిశీలించారు. రైతు, ఎంపీటీసీ కాలి ఇస్రాయేల్తో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దెందులూరు మండలంలో నిర్మించిన షెడ్లకు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. రైతులకు ఒక్కొక్కరికీ షెడ్డు నిర్మాణానికి రూ.3.60 లక్షలు నూరు శాతం సబ్సిడీగా నిధులు మంజూరు చేసిందన్నారు. రైతులు త్వరితగతిన షెడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆయన కోరారు.


రామారావుగూడెంలో నిర్మించిన షెడ్డును పరిశీలిస్తున్న మండల టెక్నికల్ అసిస్టెంట్ పీ రత్తయ్య

తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలి

గణపవరం: తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవడానికి మనమంతా కంకణబద్ధులు కావాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ తెలుగు మహాసభలు–2024 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలంతోపాటు తెలుగు భాష కూడా మార్పులకు లోనవుతూ తన ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రపంచ గుర్తింపు పొందిన తెలుగుభాష పరిరక్షణకు కవులు, సాహితీవేత్తలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వాసుబాబును సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా హైకోర్టు జస్టిస్ ఆకుల శేషసాయి, నాగాలాండ్ గవర్నర్ గణేషన్ తదితరులు పాల్గొన్నారు.


అంతర్జాతీయ తెలుగు మహా సభలలో జ్ఞాపిక అందుకుంటున్న ఎమ్మెల్యే వాసుబాబు

11 నుంచి సంక్రాంతి సంబరాలు

ఏలూరు (ఆర్ఆర్పేట): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగరంలోని సాహిత్య మండలి ఆధ్వర్యాన వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తమరావు తెలిపారు. కార్య క్రమాల్లో భాగంగా ఈనెల 11న తమ సాహిత్య మండలి ప్రాంగణంలో హైస్కూల్ విద్యార్థులకు ఉదయం మన పండుగలు – సంక్రాంతి పండుగ విశిష్టత అంశంపై వ్యాసరచన, స్వామి వివేకానంద జీవిత విశేషాలపై క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు ఈనెల 13న బహుమతులు అందజేస్తామన్నా రు. ఆసక్తి కలిగిన వారు సెల్ నంబర్: 94404 20831కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 12న జాతీయ యువజన దినోత్సవం, సంక్రాంతిని పురస్కరించుకుని సంక్రాంతి సాహిత్యోత్సవ సభ నిర్వహిస్తామన్నారు. 13న ఎస్పీఎస్ వాసు మ్యూజిక్ అకాడమీ శిష్యుల సంగీత వాద్య సమ్మేళనం, విశాఖపట్నానికి చెందిన బి.శ్రీలాస్య అన్నమాచార్య కీర్తనల ఆలాపన, సంక్రాంతి సాహిత్యోత్సవ సభ నిర్వహిస్తామన్నారు.

నేడు ఆటోల బంద్

గణపవరం: వచ్చే ఎన్నికలలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అంటూ రాజకీయ పార్టీలు ఇస్తున్న హామీలపై పునరాలోచించాలని ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి హామీల వల్ల ఆటోవాలాలు ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని వారన్నారు. దీనికి నిరసనగా సోమవారం గణపవరం, నిడమర్రు మండలాలకు చెందిన ఆటోవాలు సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందిస్తామని యూనియన్ నాయకులు తెలిపారు.

వైభవంగా అయోధ్య రాముని అక్షింతలతో శోభాయాత్ర


రామాలయ నిర్వాహకులకు అక్షింతలు, పత్రాలను అందిస్తున్న జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ

భీమడోలు: భీమడోలు, పూళ్ల తదితర గ్రామాల్లో ఆదివారం అయోధ్య రాముని అక్షింతలు ఇంటింటికీ పంపిణీ కార్యక్రమం ఆట్టహాసంగా కొనసాగింది. ఆదర్శవంతమైన జీవనం సాగించిన శ్రీరాముడు మనందరికీ ఆదర్శప్రాయుడని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ అన్నారు. భీమడోలులో అయోధ్య శ్రీరాముని అక్షింతల శోభాయాత్ర గ్రామంలో వైభవంగా సాగింది. తొలుత అయోధ్య శ్రీరామ క్షేత్ర ట్రస్ట్ మండల ప్రముఖ్ సత్యేంద్ర ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద రామభక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో చేరుకుని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పరిసర గ్రామాలకు చెందిన శ్రీరామాలయ నిర్వాహకులకు తమ గ్రామాల్లో పంపిణీ చేయాల్సిన అక్షింతలు, కరపత్రాలను జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సుతాపల్లి ప్రసాద్ అందజేసారు. అక్కడ నుంచి శ్రీరామభక్త బృందం జై రామ్ నినాదాలతో గ్రామంలో శోభాయాత్రను నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు అక్షింతలను అందించారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని ఆలయ ప్రతిష్ఠ జరగనున్నందున ఆ రోజున అక్షింతలకు పూజలు చేసి ఇంటిల్లాపాది దీపాల వెలుగుల్లో సంబరాలు చేసుకోవాలని కోరారు. పూళ్లలో మూడు రోజుల పాటు గ్రామంలోని 10 వార్డుల పరిధిలో 4వేల కుటుంబాలకు ఇంటింటికీ వెళ్లి అక్షింతలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ ప్రముఖులు దత్తాడ శ్రీనివాసరావు, తుమ్మల ఉమామహేశ్వరరావు, యర్రంశెట్టి ఏడుకొండలు, తుమ్మగుంట రంగా, ఆర్డీఎం ప్రసాద్, సుంకర శ్రీనివాసరావు, త్రిమూర్తులు, కిలపర్తి భాస్కరరావు, గంధం భాస్కరరావు, ఎస్.నాగబాబు, హనుమంతరావు, లింగంపల్లి మణికంఠ, పచ్చా వెంకటేశ్వరరావు, జీవీ గిరిధర్, బాల్జి, శ్రీమ

అలరించిన సంగీత విభావరి


అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న బీకే బిందు

ఏలూరు (ఆర్ఆర్పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యాన ఆదివారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఎస్పీఎస్ మ్యూజిక్ అకాడమీ ప్రిన్సిపాల్ ఎస్పీఎస్ వాసు బృందం నిర్వహించిన అన్నమాచార్య గీతాలాపన, సంగీత విభావరి సంగీత కళాప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. తొలుత కార్యక్రమాలను గణపతి, నటరాజస్వామి పూజ, జ్యోతి ప్రకాశనంతో హిందూ యువజన సంఘ ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు అంబికా రాజా, సహాయ కార్యదర్శి వేమా కోటేశ్వరరావు తదితర సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో గాయని గాయకులు బీకే బిందు, ఎస్పీఎస్ వహీదా వాసు, వై.అర్జున్రావులు ఆలపించిన నారాయణతే నమో నమో, వినరో భాగ్యము, చూడరమ్మ సతులార, వేడుకుందామా.. అన్నమాచార్య కీర్తనలు వీనుల విందు చేశాయి. ఎస్పీఎస్ వాసు, ఎన్వీ గంగాభవాని, సీహెచ్ కళ్యాణ్, డి.నరేష్ల శాస్త్రీయ వాద్య సమ్మేళనం వీణ, వయోలిన్, ఫ్లూట్, తబలా, గిటార్ వంటి వివిధ శాస్త్రీయ సంగీత వాద్య సమ్మేళనం ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో హిందూ యుజవన సంఘ ప్రతినిధులు ఇరదల ముద్దుకృష్ణ, మజ్జి కాంతారావు, సీహెచ్ సాయితేజ, బీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కేబీ రావు, లంక వెంకటేశ్వర్లు, వీవీవీ హనుమంతరావు, వంకినేని భానుప్రకాష్, రేవూరి శివశంకర్ వరప్రసాద్, పిలగల కొండలరావు, ఎ.పార్వతి రామచంద్రన్ ఎ.రంగ వరప్రసాద్, దువ్వి హేమసుందర్, గుడిపాటి లలితా శర్మ, గరికపాటి కాళిదాసు, అధిక సంఖ్యలో సంగీత అభిమానులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'

పెదవేగి : గ్రంథాలయాలకు రావడాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని పెదవేగి గ్రంథపాలకుడు తోట అరుణ్కుమార్ అన్నారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మా కిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని చదివారు. ఈ సందర్భంగా అరుణ్కుమార్ మాట్లాడుతూ గ్రంథపఠనంతో విజ్ఞానం, వివేకం వృద్ధి చెందుతాయన్నారు.

గ్రంథ పఠనంతో విజ్ఞానంతో విజ్ఞానం

భీమడోలు: గ్రంథ పఠనం విజ్ఞానాన్ని పంచి మనల్ని ఎప్పుడూ తల ఎత్తుకునేలా చేస్తుందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం, పుస్తక ప్రదర్శన క్యాక్రమాలు జరిగాయి. భీమడోలులో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకని చదివి పుస్తక సమీక్షలు రాసారు. ఈ కార్యక్రమాల్లో పెద్దలు కడగల సత్యనారాయణ, మోహనరావు, గ్రంథపాలకులు డీఎస్బీ అమర్నాథ్, జి.నాగమణి పాల్గొన్నారు.

పార్కు ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన

ఏలూరు (టూటౌన్): స్థానిక వసంత మహల్ సెంటర్లోని పొట్టి శ్రీరాములు పార్కు ఆధునికీకరణ పనులకు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదివారం శంకుస్థాపన చేశారు. ఏలూరు ఆర్యవైశ్య సంఘ పెద్దలు అభ్యర్థన మేరకు ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ నుంచి రూ.12 లక్షల నిధులను కేటాయించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన పేరుతో ఏర్పాటు చేసిన పార్కు ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్, గుడిదేశి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల చైర్మన్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఏలూరు ఆర్యవైశ్య సంఘ పెద్దలు తదితరులు

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

దెందులూరు: ప్రతి గ్రామంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అందరి సంపూర్ణ ఆరోగ్యం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు అన్నా రు. ఆదివారం జోగన్నపాలెంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి సీఎం జగన్మోహన్రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వానికి సహకరించి దీక్షలు విరమించి విధుల్లోకి చేరాలని కోరారు.

184 కొత్త రేషన్ కార్డుల మంజూరు

దెందులూరు: మండలంలో 184 కొత్త రేషన్ కార్డులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య తెలిపారు. ఆదివారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మంజూరు జాబితాకు అనుగుణంగా ఆయా గ్రామాల వీఆర్వోలకు పంచామన్నారు. సచివాలయాల్లో త్వరలో ప్రజాప్రతినిధులతో కొత్తగా మంజూరైన రేషన్కార్డులు లబ్ధిదారులకు అందజేస్తామని వివరించారు. జాబితాను సంబంధిత సచివాలయాలకు పంపించామని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న 12మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. మండలంలోని కొక్కిరపాడులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం స్థావరంపై దాడి చేసి 12 మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.4,900 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.